AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
24-3-2026 (Tuesday) MAIN EDITION

## రింకూ సింగ్‌కు సర్కారు ఉద్యోగం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్‌:** భారత క్రికెటర్ రింకూ సింగ్‌కు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చింది. ఆయన కనబరుస్తున్న అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా.. రీజినల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా నియమించాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన భారత జట్టులో రింకూ కీలక సభ్యుడిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో ఐదుగురు అథ్లెట్లకు కూడా ప్రభుత్వం ఉద్యోగాలు ప్రకటించింది. రాజ్‌కుమార్ పాల్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారాలింపిక్స్)లకు డీఎస్పీ ఉద్యోగాలు, అజిత్ సింగ్ (పారాలింపిక్స్), సిమ్రాన్ (పారాలింపిక్స్) డీపీఆర్వో ఉద్యోగాలు ఇచ్చింది. అలాగే ప్రీతి పాల్ (పారాలింపిక్స్)ను బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బీడీవో)గా నియమించారు.

## యుద్ధంలోకి ఎంట్రీ ఇవ్వనున్న సౌదీ, యూఏఈ..!




**అక్షరటుడే, నేషనల్ డెస్క్‌:** ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన వేళ.. వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. టెహ్రాన్‌పై అగ్రరాజ్యం చేస్తున్న యుద్ధంలోకి సౌదీ అరేబియా, యూఏఈ ఎంట్రీ ఇవ్వనున్నట్లు కథనం పేర్కొంది. తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకొనేందుకు గతంలో అనుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసుకొచ్చింది.

## ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపు



**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. అసెంబ్లీ సహా విధానసభ మెట్రో స్టేషన్‌ను పేల్చేస్తామని ఈ-మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అసెంబ్లీ వద్ద భద్రత పెంచారు.

## టీజీసెట్ ఫలితాలు విడుదల




**అక్షరటుడే, హైదరాబాద్:** గురుకులాల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీసెట్2026 ఫలితాలు విడుదల య్యాయి. 2026–27 విద్యా సంవత్సరానికి ఆను ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతితో పాటు ఆరు నుంచి తొమ్మిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఎగ్జామ్ నిర్వహించారు. ఈ ఏడాది 1,72,842 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

## అమెరికా చెప్పింది మోదీ చేస్తారు: రాహుల్



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశంలో వ్యవస్థాగత తప్పిందని జరిగిందని, దానిని ప్రధాని నరేంద్ర మోదీ సహా ఎవరూ సరిచేయలేరని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయిల్ చెప్పింది మోదీ చేస్తారని ఆరోపించారు. దేశం, రైతుల ప్రయోజనాల కోసం ఆయన పనిచేయరని విమర్శించారు.



## అమరావతిలో అగ్ని ప్రమాదం..

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో మరోసారి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా రాయపూడి సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రిన్సిపల్ సెక్రెటరీల భవనాల ప్రాంగణంలో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. హెచ్‌డీపీఈ పైపులకు ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. అర్ధరాత్రి ప్రారంభమైన మంటలు వేగంగా వ్యాపించాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి దాదాపు మూడు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది.

## రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. మంగళవారం ఉదయం నుంచి సర్వర్లు పని చేయకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈకేవైసీ లాంటి పనులు సాగలేదు.

# మత మార్పిడులపై సుప్రీం సంచలన తీర్పు



**మతంమారినవారు అట్రాసిటీ చట్టం కింద నమోదు చేసే కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హిందూమతాన్ని వీడి క్రైస్తవంలోకి వెళ్లిన వారు ఎస్సీ హక్కులు పొందలేరంటూ సంచలన తీర్పు ఇచ్చింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని, హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఈ కీలక తీర్పు వెలువరించింది. –అక్షరటుడే, నేషనల్ డెస్క్**

- ఇతర మతంలోకి వెళ్తే ఎస్సీ హోదా రద్దు
- అట్రాసిటీ నుంచి రక్షణ పొందలేరు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆయన 2021లో చందోలు పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్న తనపై రామిరెడ్డి, ఇతరులు పదేపదే దాడి చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని, కుల ప్రాతిపదికన దూషించారని ఆరోపించారు. ఆయన ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. ప్రార్థనలకు అభ్యంతరం తెలిపిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు పెట్టారు.

### హైకోర్టును ఆశ్రయించిన బాధితులు..

గుంటూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో కేసు విచారణ పెండింగ్‌లో ఉండగానే.. ఆ కేసును కొట్టివేయాలంటూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండడంతో క్రైస్తవుడు అవుతారని, రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు సంబంధం ఉండదని బాధితుల్లో ఒకరైన రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించనందున.. ఆయన ఆ చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదు చట్ట వ్యతిరేకమన్నారు. కేసుకు విచారణార్హత లేదని వాదించారు. హైకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేనందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించదని పేర్కొంది. రాజ్యాంగం(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ 1950 ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మతాలు కాకుండా మరే మతంలోకి మారినా ఎస్సీ హోదా రద్దు అవుతుందని స్పష్టం చేసింది.

### సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన రక్షణ కల్పించలేం..

క్రైస్తవ మతంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొంద లేరన్న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై న్యాయ మూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారించి, తుది తీర్పును మంగళ వారం వెలువరించింది. ధర్మాసనం ఏపీ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ మతం మార్చుకుంటే వెంటనే ఎస్సీ హోదా రద్దవుతుందని, కుల సర్టిఫికెట్ రద్దు కాకపోయినా ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించబోదని తేల్చిచెప్పింది. క్రైస్తవంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొంద లేరని స్పష్టం చేసింది. మతం మారితే కుల సర్టిఫికెట్ రద్దు కాకపోయినా చట్టం వర్తించదని, సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన రక్షణ కల్పించాలని చెప్పలేమని పేర్కొంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై ఈవీ వాహనాలు..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించడం, పెట్రోల్, డీజిల్‌పై ఆధారాన్ని తగ్గించడం కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా ఈవీ పాలసీ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వాహనాల కొనుగోలుపై భారీ రాయితీలు, సబ్సిడీలు అందిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిచనున్నామని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలపై ఉద్యోగులకు 15 శాతం నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వాలని కంపెనీలకు సూచనలు చేశామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆయా కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

## త్వరలో 'సాదాబైనామా' దరఖాస్తుల పరిష్కారం..



**అక్షరటుడే, హైదరాబాద్:** సాదాబైనామా దరఖాస్తులపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని వెల్లడించారు. శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందన్నారు. కానీ 2020 ఆర్.ఓ.ఆర్ చట్టంలో వాటి పరిష్కార మార్గాన్ని చూపలేదన్నారు. తాము తీసుకొచ్చిన 76 జీవోతో తొమ్మిది లక్షలకు పైగా దరఖాస్తుదారులకు లబ్ధి చేకూరనుందన్నారు.

## ఆ సినిమా చేసినందుకు ట్రోల్ చేశారు..



నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయ మైంది కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ హీరోయిన్.. ఆ తర్వాత మహానటి సినిమా తో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంది. తన నటనతో సావిత్రినే మరిపించి ఆడియన్స్ హృదయాల్లో మహానటిగా పేరు సంపాదించుకుంది. అనంతరం వరుస సినిమాలో రాణిస్తోంది. అయితే కీర్తిసురేష్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన ఫిల్మ్ కెరియర్.. సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మహానటి చిత్రాన్ని ఓకే చేసినందుకు తనను కొందరు ట్రోల్ చేశారని.. ఆ సినిమా పూర్తయ్యాకే ఈ విషయం తనకు తెలిసిందని చెప్పుకొచ్చింది. తనపై వచ్చిన విమర్శలు పక్కనపెడితే సావిత్రమ్మ పాత్రలో నటించినందుకు చాలా గర్వంగా ఉంది"అని చెప్పుకొచ్చింది కీర్తి సురేష్.


–అక్షరటుడే, సినిమాడెస్క్

## సరిపడా ఇంధన నిల్వలు: మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను గమనిస్తున్నామని ప్రధాని నరేంద్ మోదీ తెలిపారు. అక్కడ యుద్ధం జరగడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇది ప్రపంచంలో తీవ్ర ఇంధన సంక్షోభానికి దారితీసిందని వివరించారు. భారత్‌కు కూడా ఆందోళనకరంగా మారిందని తెలిపారు. రాజ్యసభలో మాట్లాడిన ఆయన.. దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు. భారత్‌కు హర్మూజ్ జలసంధి నుంచి కూడా చమురు నౌకలు వస్తాయని, అవి సురక్షితంగా మన పోర్టులకు చేరేలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని తెలిపారు. అక్కడ చిక్కుకున్న మన వారిని సురక్షితంగా తీసుకొచ్చామని వివరించారు. ఇప్పటివరకు 3.75లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారన్నారు. అన్ని సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కార మార్గమని మోదీ పేర్కొన్నారు.

## ఇస్రో 'యువిక 2026' రిజిస్ట్రేషన్లు ప్రారంభం..



**అక్షరటుడే, ఎడ్యుకేషన్‌డెస్క్‌:** విద్యార్థులు యువ సైంటిస్టులు ఎదగడానికి ఇస్రో ప్రోత్సాహం అందిస్తోంది. అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న పాఠశాల విద్యార్థుల కోసం 'యువ శాస్త్రవేత్త కార్యక్రమం'ను ప్రకటించింది. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు మే 11 నుండి మే 22 వరకు ఇస్రోకు సంబంధించిన కేంద్రాల్లో శాస్త్రవేత్తలతో శిక్షణ ఇవ్వనుంది. అయితే ఇందుకు సంబంధించిన ఖర్చులన్నింటినీ కూడా ఇస్రోనే భరించనుంది. దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31 ఆఖరి తేదీగా నిర్ణయించింది. 8వ తరగతి మార్కులతో పాటు ఆన్‌లైన్ క్విజ్, సైన్స్ ఫెయిర్స్, ఒలింపియాడ్స్, క్రీడల్లో వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 15 శాతం అదనపు వెయిటేజీ ఇవ్వనుంది. 'యువిక 2026' కోసం విద్యార్థులు ఇస్రో అధికారిక వెబ్‌సైట్ 'అంతరిక్ష జిజ్ఞాస' ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

## నకిలీ వైద్యుడి అరెస్ట్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలో నకిలీ డాక్టర్లు భారీగా ఉన్నారు. దొంగ సర్టిఫికెట్లతో పలువురు వైద్యులుగా చెలామణి అవుతున్నారు. నేరేడ్‌మెట్‌లో నకిలీ డెంటల్ డాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రమేశ్ అనే వ్యక్తి 20 ఏళ్లుగా క్లినిక్ పెట్టి డెంటల్ వైద్యం చేస్తున్నాడు. అనుమానం రావడంతో పోలీసులు మంగళవారం క్లినిక్‌లో తనిఖీలు చేపట్టారు. నకిలీ వైద్యుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. యూపీకి చెందిన రమేష్ హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ఇక్కడ దంత వైద్యుడి అవతారం ఎత్తి రోగులకు చికిత్స సైతం చేస్తున్నాడు. అయితే అతడు పదో తరగతి కూడా చదవకపోవడం గమనార్హం. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రమే రమేష్ వైద్యం చేస్తున్నాడు. అతడిపై అనుమానం రావ దంతో ఎస్‌వోటీ పోలీసులు సోదాలు చేసి ఫేక్ డాక్టర్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాజ్‌గిరి పోలీసులు తెలిపారు.